కథానిక

# శృంగభంగం

జయంతి శ్రీరామమూర్తి

"మీరు వ్రాసిన ఉత్తరం చేరింది. అందులో మీరు ఫలానారోజున వస్తున్నానని గాని, వస్తాననిగాని వ్రాయకపోడం చాలా విచారకరం. నా బెంగ మీకెల్లాగ తెలిసేది? క్యాంపు పేరు చెప్పి వెళ్ళి రెండు నెలలయింది. నన్నూ పాపనూ పట్నంలో వంటరిగా విడిచి అలాగ దూరాన వుండడం మీకే తగును. మీ వద్దనుంచి వచ్చే ఉత్తరం ముక్కలు చూసు కుంటూ సంతృప్తిపడి ఎంతకాలం ఇలాగ పడి వుండగలను? ఇంతేనా జీవితం. ఈ వయసులో ఇదేనా సుఖం? ఏ జన్మలోనో మహాపాపం చేసివుంటేను. వడ్డీతో అదంతా ఇప్పుడు అనుభ విస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఇలాగ అనుభ వించాలో? ఇంతకీ మీరు రారుగదూ? ఒక్క సారి రండి, రెండే రెండు రోజులుండి వెళ్ళి పోదురుగాని. నా పంచప్రాణాలూ మీమీదే పెట్టుకుని బ్రతుకుతున్నాను. నాకోసం రండి. తప్పక రండి. రాకపోతే మాత్రం జాగ్రత్త. పిచ్చిఎత్తి ఏం చేస్తానో నాకే తెలియదు. ఆ మీదట మీరు విచారించిగాని పశ్చాత్తాపపడి గాని లాభంలేదు సుమా!

పార్వతి"

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు చంద్రశేఖరం. అతని మనసులో వింతభావాలు విచిత్రంగా తిరగడం మొదలు పెట్టేయి. తన ఉద్యోగపు అసందర్భానికీ, పార్వతి వంటరి తనానికీ విచారం కలిగింది. ఆమె వ్రాతలకు ఆశ్చర్యం కలిగింది. ముఖ్యంగా ఆఖరి పంక్తులు తలచుకున్న కొలదీ అనుమానంకలిగింది. ఆవిడ తనను భయపెడుతూ వ్రాసినందుకు రోషం కలిగింది.

"పిచ్చిఎత్తిపోతుందట - ఎలాంటి పిచ్చి? పిచ్చియెత్తి యేం చేస్తుంది? మళ్ళీ నేను విచా రించి లాభంలేదట! ఏమిటి దాని వుద్దేశం? ఈ మాటలు వ్రాయడానికి దానిని ప్రేరేపిం చినదెవరు? వ్రాతలతో ఆగుతుందా? లేక ..."

ఇలా ఆలోచించినకొద్దీ చంద్రశేఖరం బుర్ర వేడెక్కిపోయింది. ఏవేవో క్రూరాతి క్రూర మైన తలపులు పెనవేసుకుని అతని మనస్సును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాతడపా స్నేహితులు చెప్పినవీ విశ్రుతమైనవీ ప్రణయ గాథలు జ్ఞాపకం వస్తున్నాయి.

"ప్రేమ అనేది సముద్రం. అందులో రత్నాలూ వున్నాయి, రాళ్ళూ వున్నాయి. చాలామందికి సముద్రంలో దిగినవాళ్ళకి రాళ్ళే దొరుకుతాయి. ఆఖరికి నా బ్రతుకూ ఇంతేనా? పెళ్ళయిన కొత్తలో పార్వతి పలికిన ప్రేమ వాక్యాలూ, వాగ్దానాలూ బూటకాలేనా? ఏమో! లోకంలో ఎవరినీ నమ్మకూడదంటారు."

ఏమీ తోచక చంద్రశేఖరం లేచి నిలబడ్డాడు. అప్పటికి రాత్రి పదిగంట లయింది. గది తాళం వేసి సమీపాన వున్న పార్కులో బెంచీమీద వొరిగేడు చంద్రశేఖరం. అంతా నిశ్శబ్దంగా వుంది. ఆకాశంమీద చంద్రుడు నిమ్మతొన లాంటి ఆకారంతో నిగనిగలాడుతున్నాడు. చిరుగాలికి చెట్లన్నీ తలలూపుతున్నాయి. మళ్ళీ పార్వతి జ్ఞాపకం వచ్చిందతనికి-ఆమె వ్రాతలు అతనిలో మళ్ళీ అనుమానపు దుమారాన్ని రేగ కొడుతున్నాయి.

"ఆమె నిజంగా అంతపనీ చేస్తుందా? ఏమో, ఎవరిని గురించి ఎవరు చెప్పగల రీ లోకంలో? అయినా ఇలాంటి విషయాలను ఇంత టితో పోనివ్వకూడదు"—అనుకుంటూ లేచి గబగబా గదికి బయలుదేరాడు చంద్రశేఖరం.

* * *

"నీవుత్తరం చూసేను. నీఆనందానికి ఏనాడూ అడ్డురావడం నాకిష్టంలేదు. కాని, ఈ నా ఉద్యోగం నాకు ప్రధానం. శెలవు దొరకదూ

అంటే దొరకదు. నువ్వు పదేపదే అలా వ్రాసి గాని, భయపెట్టి గాని ప్రయోజనం లేదు. నాకింకా యిక్కడ రెండు నెలలు పనివుంది. ఈలోపుగా నేను చెయ్యగలిగినదేదీ లేదు. నీకుమాత్రం ఏది సుఖమనితోస్తుందో అది చెయ్యవచ్చును. చెప్పడం మరచిపోయాను. వచ్చే శుక్రవారం నాడు నా స్నేహితుడొకడు బెంగుళూరు వస్తున్నాడు. అతని పేరు రాజమూర్తి. బెంగుళూరులో అతనికి తెలిసిన వాళ్లెవరూ లేరు: నిర్భయంగా మన యింటిలో వుండవచ్చని వ్రాసేను. రెండురోజులుంటాడు, మర్యాదగా చూడుసుమా? నా చిన్ననాటి చెలికాడు. బాగా డబ్బున్నవాడు. పైకి మాత్రం వింతగా కనబడతాడు. గడ్డమూ, తలపాగా వాడూను. ఎవరేనా పగటివేషగాడను కొంటేవు. చాలా స్థితిపరుడు. మోమోటంజాస్తి. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే మనయింటిలోని మనిషిలాగే చూడవలసిందని.

చంద్రం"

ఉత్తరం మడిచి అలమారులో పెట్టి పడక కుర్చీలో వ్రాలింది పార్వతి. ఒక్కసారి బావురుమని ఏడవాలనిపించింది—ఇందులో కూడా భర్త వస్తానన్న ముక్క ఎక్కడా లేదు. తనకుమాత్రం ఎందుకో వంటరిగా వుండడం కష్టంగావుంది. ఒక్కసారి అయినా ఆయన మొహం చూడాలని ప్రాణం పీకుతోంది. "పాపం ఎలావున్నారో? బొత్తిగా భోజనం విషయంలో శ్రద్ధలేనిమనిషి. మామా యింటిలో వున్నప్పుడే పెట్టినవన్నీ సరిగా తిననిరకం. ఆ హోటలు మెతుకులు కొరికి ఏంఅఘోరిస్తున్నారో? ఏం చెయ్యను? ఎన్నిసార్లు రమ్మని వ్రాసినా వస్తానన్న ముక్కే లేదు. ఏం, లోకంలో అంతా యిల్లాగే వున్నారా? పెళ్ళాన్నీ పిల్లనీ ఒక్కసారి చూద్దామని తనకి మాత్రంవుండవక్కర్లేదా? పైగా మగవాళ్లులేని యింటికి స్నేహితుణ్ణి రమ్మన్నారట. ఆ స్నేహితుడు మాత్రం ఎలా వస్తానన్నాడో? ఈ వూళ్ళో తెలిసినవాళ్లెవరూ లేకపోతే ఏ హోటలుకో వెళ్ళాలి. పైగా ధనవంతుడట. ఆ మాత్రం ఖర్చు పెట్టకూడదా"—ఇలా గసుకుని లేచి కాగితమూ కలమూ తెచ్చుకుంది పార్వతి భర్తకి వ్రాసేద్దామని. కాని, ఇంతలోనే మనస్సు మారి ఆయనమాట త్రోసివెయ్యడం భావ్యం కాదనుకుంది. "ఏమో! ఎవరిసహాయం యెప్పుడు కావలసివస్తుందో. వాళ్లకీ వాళ్లకీ ఏం మొహమాటాలున్నాయో? మధ్యని నేనెందుకు నాగుణం చూపించుకోవాలి? రెండు రోజులేగా, కళ్లు మూసుకుంటే అవే గడుస్తాయి. కలో గంజో మాతోబాటే పెడతాను. ఆ సావిట్లో నిద్రపోతాడు-ఇంకా నయం, తొందరపడి రాసేశాను గాదు" అనుకుంటూ లేచి ఇంటిపనిలో పడిపోయింది పార్వతి.

* * *

శుక్రవారం పగలంతా చూసింది కాని ఆ స్నేహితుడు రాలేదు. మధ్యాహ్నం అతని కోసం వండిన అన్నం సాయంత్రం పాలమనిషికి పెట్టేసింది. ఇక రాత్రికి తిరిగి వండలేదు అంతగా వస్తే చూచుకోవచ్చని. చీకటి పడగానే భోజనంచేసి పాపని నిద్రబుచ్చి పుస్తకం చదువుకుంటోంది పార్వతి. రాత్రి ఎనిమిదయింది. ఇంతలో ఎవరో వీధి తలుపు తట్టిన శబ్దమయితే "ఎవరు?" అంది కాని జవాబు రాలేదు. గాలి కాబోలు ననుకుని పుస్తకం చూసుకుంటూ కూర్చుంది. కాని ఇంకో నిముషానికి మళ్లీ చప్పుడయింది. పార్వతి వెంటనే లేచి, సావిడి లైటువేసి వీధి తలుపు తీసింది. రాజమూర్తి వచ్చి గుమ్మంలో నిలబడివున్నాడు. నల్లనిగడ్డమూ, పచ్చని తలపాగా కళ్లకి జోడూ వింతగా కనిపించేడు. ఆయన వేషం చూస్తే కొంచెం భయం కలిగిందిగాని భర్త వ్రాసిన మాటలు జ్ఞాపకంచేసుకుని ఉపశాంతి పొందింది. "రండి, రండి" అంటూ లేడిపిల్లలా లోనికి గంతేసి, నీళ్ల చెంబు తెచ్చి కాళ్లు కడుక్కోమంది. అతడు చేతిలోవున్న చిన్న పెట్టె సావిట్లో పెట్టి కాళ్లు కడుక్కుని లోనికివచ్చేడు. పార్వతి తువ్వాలు అందించి, "పదినిముషాలు కూర్చోండి వంట చేసేస్తాను. మధ్యాన్నం రాలేదని యీపూట మీకోసం వండలేదు. పదే పది నిముషాలు"—అంటూంటే అతడు "వద్దండి. ఇప్పుడే హోటలులో తిని వచ్చేను—రాత్రి పూట మిమ్మల్ని బాధపెట్టడం యిష్టంలేక. అసలీ రాత్రి అక్కడే పడుక్కుని రేపు ఉదయం వద్దామనుకున్నా. కాని, మిమ్మల్ని చిన్నబుచ్చడం యిష్టం లేకపోయింది" అన్నాడు.

"హోటల్లో ఎందుకుతిన్నారు? నాకు బాధేమిటి? నాకు మాత్రం ఏం పనివుంది. పోనీ కాఫీ అయినా పెడతాను కూర్చోండి" అంటూ వంటయింట్లో దూరి స్టౌ వెలిగించింది పార్వతి. నీళ్ళు కాగుతూండగా మధ్యమధ్య సావిట్లోకి చూస్తే ఆయన వింతగా యిల్లంతా పరకాయిస్తున్నాడు. తనభర్త వయస్సే వుండవచ్చును గాని ఆయనలోవుండే నాజూకుతనం లేదనుకుంది. కాఫీ కాచేసి కప్పులో తీసుకువెళ్ళి అందించింది పార్వతి. అతడా కాఫీ చప్పరిస్తూ ఇలా ఆరంభించాడు.

"అయితే మావాడు మిమ్మల్ని వంటరిగా వదిలేసి వెళ్ళేడన్న మాట. పోనీ వారంవారం వస్తుంటాడా చూడడానికి?"

"వారంలేదు నెలాలేదు" అంది ఆమె.

"అదేం? పది రోజులకేనా ఒక్కసారి వచ్చిపోగూడదూ?"

"అదే మీ స్నేహితునిలో వింత" అని పెదిమెలు నొక్కుకుంది, క్రొత్త మనిషితో అధిక ప్రసంగం చేస్తున్నాననుకొని.

"ఎద్దమ్మా! వద్దు నొచ్చుకోకండి. నాకు తెలుస్తుంది మీబాధ. వాడిమొహం, చంద్రకళలాంటి మీముఖం చూడడానికేనా రావచ్చు మధ్యమధ్య. నే వుత్తరం రాస్తాను లెండి. చవట దద్దమ్మలాగున్నాడు" అన్నాడు మళ్ళీ రాజమూర్తి.

"వద్దండి. మీరేం రాయవద్దు" అంది పార్వతి.

"అది కాదమ్మా నేననేది-వాడు వంటరిగా వుండగలిగినా మీరుండగలరా? వాడికా మాత్రం జ్ఞానం లేదా?"

పార్వతి భర్తను గురించిన నిందావాక్యాలు వినలేక, "పోనీండి దానికేంగాని మీ ప్రక్క యీ మూలా? ఆ మూలా?" అంటూ లోనుండి ఒక పరుపు, రెండు దుప్పట్లు, ఒక తల దిండూ తెచ్చింది. రాజమూర్తి "ఏ మూలైనా ఫరవాలేదు. మీరుమాత్రం నా మూలాన యిబ్బంది పడకండి. ఒక్క దిండయినా నాకు చాలును. ఇదేం చలికాలమా? ఆపైన ఇల్లు కదలితే ఇతర చోట్ల నాకు నిద్రపట్టదు" అన్నాడు. అతని ఉపన్యాసం పూర్తి కాకుండానే పార్వతి కోడిగ్రుడ్డు లాంపు వెలిగించి, "నిద్రపోయే ముందు వీథి తలుపు బాగా వేసి పడుకోండి" అంటూ గదిలోకి వెళ్ళి మెల్లగా తలుపులు దగ్గరగా చేర్చి గడియవేసుకుంది. పిల్ల ప్రక్కలో పడుకుందిగాని నిద్రపట్టడంలేదు. పదినిముషాలున్నాక రాజమూర్తి "ఏమండీ! తలుపొకసారి తీస్తారా? కొంచెం మంచినీళ్లు కావాలి" అన్నాడతను. పార్వతి లేచివెళ్ళి మంచినీళ్ళ మరచెంబు ప్రక్కనబెట్టి మళ్ళీ గదిలోకి వస్తూంటే అతడే మళ్ళీ "ఇంకా ఏమన్నా కావలిస్తే పిలుస్తాను ఏమీ అనుకోరుగదా?- అన్నట్లు మీ పేరెవరు?" అన్నాడు. "పార్వతి" అని చెప్పి నెమ్మదిగా గదిలోకి వచ్చి, గడియ వేసుకొని మంచంమీద వ్రాలింది ఆమె. వచ్చిన వ్యక్తిని చూస్తే ఏవేవో సందేహాలు కనిపిస్తున్నాయి. అతని గొంతుకలో కృత్రిమమూ, మాటలలో ద్వంద్వార్థాలూ గోచరిస్తున్నాయి. "పోనీలే. ఆయనే వ్రాసేరుగా వింతమనిషి అని. నాకేం. రెండు రోజులు కళ్లు మూసుకుంటే తానే వెళ్లిపోతాడు" అనుకుని కళ్లుమూసింది పార్వతి.

* * *

అర్థరాత్రివేళ "పార్వతీ, పార్వతీ" అని ఎవరోపిలిచినట్లు వినబడగానే తటాలున లేచి కూర్చుంది ఆమె. గోడగడియారం "జాగ్రత్త, జాగ్రత్త" అంటూ కొట్టుకుంటూంది. రాజమూర్తి మళ్ళీ తలుపుకొట్టి "పార్వతీ పార్వతీ" అని పిలుస్తున్నాడు. ఆమె కొంచెం భయపడి అక్కడనుండే "ఏంకావాలి" అని అడిగింది. అతడు మళ్ళీ "ఇలా రా అర్జంటుగా పనుంది" అన్నాడు.

ఆమె మెల్లగా తలుపుతీసి "ఏంపని" అంది.

"ఇలా దగ్గరగావస్తే చెబుతాను. అంతేకాని, పులిని చూసినట్లు దూరాన్నుంచి చూస్తూ మాట్లాడితే ఏంచెప్పను?" అన్నాడు. ఆమె జంకుతూ కొంచెంముందుకువెళ్ళి "ఏంకావాలి, చెప్పండి" అంది.

"నీతో ఒక్కమాట చెప్పాలని పిలిచేను. ఇలాంటి వెన్నెల రాత్రులు ఈ వయస్సులో వ్యర్థం చేసుకుంటావా? ఇవిమళ్ళీ తిరిగివస్తాయా? నీ జీవితంలో వాడు దగ్గరలేడని నీ సుఖాలకు నీళ్ళు వదులుకుంటావా?" అన్నాడతడు.

"క్షమించండి. నాకిల్లాంటి మాటలు వినాలని లేదు" అంది పార్వతి.

"వెర్రిదానా, అర్థంచేసుకో. వాడి కర్మ వాడిని ఏడవనీ. నీ ఆనందం నీ అరచేతిలోవుంది రా, ఇలా దగ్గరగా రా–నీచిరునవ్వుకి రత్నాలు పోలకబోస్తాను. కౌగిల్లో, విమానాలలో త్రిప్పుకుంటాను...."పార్వతి అదరపడి వెనక్కి తగ్గింది. అతనుకూడా లేచి గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాడు పార్వతికి ఉపాయమేమీతోచడం లేదు. మొహంనిండా చెమటలు పోసేయి. జుట్టంతా చెరిగిపోయింది. హృదయం స్పందిస్తూంది. గాత్రంకంపిస్తూంది. ఎలాగో ప్రయత్నం చేసి ఇలాగ అనగలిగింది "ఇది మీకు న్యాయం కాదు. మీరంటే ఆయనకు ఎంత గౌరవమో, దానికి ఇదా ప్రతిఫలం మీరిచ్చేది"—

"ఇదిగో ప్రతిఫలం"అంటూ అతడొక పచ్చనోటుతీసి అందివ్వబోయాడు. పార్వతి మళ్ళీ వెనక్కి తగ్గి,

"చాలుచాలు. స్త్రీజాతి తమరూహించినట్లు పతనమైపోలేదు. తప్పుకుంటారా? లేదా? లేకపోతే వీధిలో పడి గోలచేస్తాను" అంది.

"గోలచెయ్యి–నీకే నష్టం. తెల్లవారితే నామానాన నేను పోతాను. నువ్వే అప్రతిష్టపాలవుతావు. అదంతా ఎందుకులే–రా–నిన్ను సింహాసనంమీద కూర్చోపెడతాను. రెండో పక్షికి తెలియనివ్వను" అంటూ అతడు ఆమె చెయ్యి పట్టుకోబోయాడు. ఆమెకు వెనక్కి తగ్గింది. అతడుమళ్ళీ ఆమెను పట్టుకోబోయాడు. ఆమె లేనిబలం తెచ్చుకొని ఛెళ్లున అతని దవడమీద ఒక్కటి వేసింది. ఆ దెబ్బకి అతడలాగే గూబపట్టుకుని కుర్చీలో పడిపోయాడు. తలపాగా సగం వూడి నేలమీద పొరాడుతూంది. పార్వతి గుండెదడతో గదిలో దూరి తలుపులు వేసుకుంది. పదిలంగా వచ్చి ప్రక్కమీద పడుకుందన్న మాటేగాని ఆమెలో తీవ్రమైన భయోత్పాతం కలిగింది. అది తుఫానుకి మొదలో తుదో తెలియడం లేదు. రాజమూర్తి మాత్రం మళ్ళీ కిక్కురు మనలేదు. అతనికేం ప్రమాదం కలగలేదు గదా అని ఆమె కొంచెం భయపడింది. ఇలాంటి స్నేహితుని యింటికి పంపించిన భర్తమీద కోపం కలిగింది. ఇంత వరకూ చల్లగా చూసినందుకు దేవునిమీద భక్తి కలిగింది.

* * *

ఉదయం ఏడు గంటలకే మెలకువ వచ్చినా పార్వతి తలుపు తియ్యలేదు. రాజమూర్తి ఎక్కడ పీక నొక్కుతాడో అని భయపడింది. ఏడున్నరదాకా చూసి అతనున్న జాడే వినరాక పోతే మెల్లగా తొంగిచూస్తూ తలుపులు తెరచింది. పడకకుర్చీలో ఎవరో వున్నారు గాని రాజమూర్తిలా గడ్డమూ అదీ లేదు. ఆమె తేరిపార చూసింది. తన భర్త చంద్రశేఖరమే ఆ కుర్చీలో వాలివున్నాడు. ఆమెలో ఆనందసాగరం ఉప్పొంగింది. రాత్రి జరిగిన ఉదంతమంతా ఒక్క గుక్కలో చెప్పివేద్దామనుకుంది గాని మాట రాలేదు.

"ఎప్పుడు వచ్చేరు? బాగున్నారా?" అని మాత్రం ఎల్లాగో అనగలిగింది.

"ఉన్నానిల్లాగే" అన్నాడు చంద్రశేఖరం. మందంగా జబ్బు పడిన వానిలా వున్నాడు.

పార్వతి సమీపించి, "అదేం అలా వున్నారు పళ్లు సలుపా? చెవి పోటా? దవడ అలా వాచిందే" మంది.

అతడు శూన్యంలోకి వెర్రిగా నవ్వి,

"ఇదంతా ఒక అమాయకురాలి శీలాన్ని శంకించిన ఫలితం" అన్నాడు.

పార్వతి నిలువునా నీరైపోతూ "అయ్యో మీరా! ఎంతపని జరిగింది, ఎంతపని జరిగింది" అంటూ అతని పాదాలమీద వొరిగింది.

సిగ్గుతో తలవంచుకు కూర్చున్న పార్వతి బ్లౌజు కాలరులో రాత్రి చూపిన పచ్చనోటు పెడుతూ రెండు చేతులా ఆమె ముఖారవిందాన్ని పైకెత్తేడు చంద్రశేఖరం.

---

మెదడు సక్రమంగా పని చెయ్యడం అన్నది తృప్తికరమైన భోజనంమీద ఆధారపడి ఉంది. అంతమాత్రాన తృప్తికరంగా భోజనం చేసేవాళ్ళంతా మేధావంతులైపోరు.—వోల్టేర్